క్లుప్తంగా

గ్రామ దేవతలకు పూజలు


పుట్టపెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో వెలసిన ఎల్లమ్మ, చౌడమ్మ, పెద్దమ్మ దేవతలకు భక్తులు పాల్గుణ మాసం మంగళవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనగానపల్లెకు వెళ్లే రహదారిలోని పుట్టపెద్దమ్మకు ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, నంద్యాల రహదారిలో వెలసిన దుర్గా మల్లేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కనుల పండువగా శ్రీచక్రస్నానం


చక్రస్నానం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీగోదాదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అశేష భక్తజనం మధ్య చక్రస్నాన ఘట్టం నిర్వమించారు. ఆలయం నిర్మించి 25వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురష్కరించుకుని వార్షిక బ్రహ్మోత్స వేడుకల్లో భాగంగా శ్రీచక్ర స్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు పాతాళం సుబ్బారావు, రజనికుమారీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

బనగానపల్లెరూరల్: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ 7వ తరగతి విద్యార్థిని నూర్జహన్ ఎడ్యుకేషనల్ ఫణి పరీక్షల్లో జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకు సాధించింది. ఈ మేరకు నూర్జహన్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ రామలక్ష్మితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ప్రతి సంవత్సరం ఎడ్యుకేషనల్ ఫణి సంస్థ 7,10వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. జనవరి 31వ తేదీన నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 51వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, జిల్లా స్థాయిలో నూర్జహన్ రెండవ ర్యాంకు సాధించిందని వివరించారు.

విజయ డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి కృషి

బేతంచెర్ల: విజయ డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి సంస్థ కృషి చేస్తోందని కర్నూలు మిల్క్ యూనియన్ డిప్యూటీ డైరక్టర్ ఏవీకే రాజేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోర్లగుట్టలో పాడి రైతులకు, సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మం ఆచారి ఆధ్వర్యంలో రూ.84,223 పాల బోనస్‌ను 32 మంది పాడి రైతులకు పంపిణీ చేశారు. పాడి రైతుల అభివృద్ధికి విజయ డెయిరీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో బనగానపల్లె విజయ డెయిరీ మేనేజర్ పీవీ మధుసూదన్ బాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరతో శనగ దిగుబడుల కొనుగోలు

బనగానపల్లె: శనగ ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. మార్కెట్‌లో క్వింటాం రూ.4400 ఉండడంతో రైతుపక్షపాతి అయిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5335 చొప్పున గిట్టుబాటు ధరతో శనగ దిగుబడులను కొనుగోలు చేస్తుంది. ఎక్కడ అవినీతికి అస్కారంలేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేస్తున్నారు. 15 రోజుల నుంచి కైప ఆర్బీకే పరిధిలో 1,500క్వింటాళ్లను కొనుగోలు చేశారు. గిట్టుబాటు ధరలభిస్తున్నందున రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్బీకేల ఆధ్వర్యంలో శనగ దిగుబడులను కొనుగోలు చేస్తామని సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారి శంకర్ తెలిపారు.

గ్రామగ్రామానా ధార్మిక చైతన్యం కల్పిస్తాం

బనగానపల్లె: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గ్రామగ్రామానా ధార్మిక చైతన్యం కల్పిస్తామని ఆ పరిషత్ ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లువెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సాదుకొట్టంలోని శ్రీరామాలయంలో ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన ప్రారంభమైంది. కార్యక్రమంలో పాల్గొన్న మల్లువెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ధర్మిక చైతన్యం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ పని చేస్తోందన్నారు. అనంతరం గీతా ప్రచారకులు వైష్ణవ రామశేషయ్య శ్రీమద్రామాయనంపై ప్రవచనం చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, నాగరాజు, మధుసుదాకర్, శ్రీనివాసులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు!

- జలజీవన్ మిషన్ కింద గడప గడపకూ కుళాయి
- డోన్ నియోజకవర్గానికి రూ.20 కోట్లు
- సోంపురం గ్రామంలో పనులు పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మండలాల వారీగా నిధుల వివరాలు

మండలం	గ్రామాలు	మొత్తం
డోన్	46	రూ.7,86,68,000
ప్యాపిలి	43	రూ.6,97,40,000
బేతంచెర్ల	30	రూ.538,40,000



సోంపురంలో ఇంటి వద్ద నీరు పట్టుకుంటున్న ఓ మహిళ, సోంపురంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

డోన్ : ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. నేరుగా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే గడప గడపకూ మంచినీటి కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన మంచినీటిని ప్రజలకు పంపిణీ చేసేందుకు కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం హర్ ఘర్ జల్(ప్రతి ఇంటికీ మంచినీరు)అనే పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. జలజీవన్ మిషన్ పథకం కింద డోన్ నియోజకవర్గానికి రూ.20,22,48,000 మంజూరు అయ్యాయి. అదేవిధంగా డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద ప్రభుత్వం పైపులైన్ నిర్మాణం కోసం అదనంగా నిధులను విడుదల చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. 40వేల లీటర్ల నిల్వ సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పూర్తవ్వగా మరికొన్ని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.

పైలెట్ ప్రాజెక్టుగా సోంపురం

జలజీవన్ మిషన్ కింద ప్రభుత్వం డోన్ మండలం సోంపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు అధికారులు. ప్రజాప్రతినిధులు, అధికారులు పనులను పర్యవేక్షిస్తూ పనులు పూర్తి చేయించారు. ఓవర్‌హెడ్ ట్యాంకుతో పాటు మంచినీటి సరఫరా పైపులైన్ నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నారు. నీటి సమస్య తీరనుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సమస్య తీరింది


మంచినీటి కోసం ప్రతి ఏటా గ్రామస్తులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో నీటి సమస్య తీరింది. భవిష్యత్తులో నీటి ఎద్దడి ఎదురు కాకుండా మంత్రి చర్యలు చేపట్టారు. మంత్రి సాయం మరువం.
– వేమారెడ్డి, గ్రామ సర్పంచ్, సోంపురం.

చాలా ఇబ్బందులు పడ్డాం


వేసవి వచ్చిందంటే మంచినీటి కోసం యుద్ధం చేయాల్సి వచ్చేది. చాలా ఇబ్బందులు పడ్డాం. ఇలాంటి పరిస్థితుల్లో స్వచ్ఛమైన మంచినీటిని ఇంటింటికీ అందజేసేందుకు మా గ్రామాన్ని ఎంపిక చేయడం సంతోషకరం. ప్రభుత్వ సాయాన్ని మరువం.
– లక్ష్మిదేవి, గృహిణి, సోంపురం.

ఈనెలాఖరుకు ప్రారంభం


జలజీవన్ పథకం కింద గ్రామంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. నియోజవర్గంలో తాగునీటి ఎద్దడి అనేది భవిష్యత్తులో మచ్చుకైనా కానరాదు.
– రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ, డోన్

లక్ష్యాన్ని సాధిస్తాం


డోన్ నియోజకవర్గంలోని దేవరబండ 90వేల లీటర్లు, కొత్తకోటలో 60వేల లీటర్లు, పట్టణంలోని కొండపైన లక్ష లీటర్ల నీటిని నిల్వ చేసే ట్యాంకులను నిర్మించడం జరిగింది. అనుకున్న సమయానికి జలజీవన్ మిషన్ లక్ష్యాన్ని అందరి సహకారంతో సాధిస్తామనే విశ్వాసం ఉంది. భవిష్యత్‌లో నీటి సమస్య ఉండదు.
– రమేష్‌రెడ్డి, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, డోన్

నిత్యాన్నదాన సంస్థకు విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో ఉన్న శ్రీపెద్దమ్మ తల్లి నిత్యాన్నదాన సంస్థకు బనగానపల్లె పట్టణానికి చెందిన కె రాజశేఖర్ రెడ్డి, లీలావతి దంపతులు, కుమారుడు సాయికృష్ణారెడ్డి రూ.10వేల విరాళాన్ని అందజేశారు. నిత్యాన్నదాన సంస్థ నిర్వాహకులు రామగంగిరెడ్డి మంగళవారం నగదు ఇచ్చారు. దాతలకు రామగంగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

డోన్ టౌన్: పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని షాదిఖానాలో ఈనెల 16వ తేదీన డోన్ డివిజన్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సీహెచ్ ఆదాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజ్, జనరల్ హాస్పిటల్ సహకారంతో గురువారం ఉదయం 10గంటల నుంచి సాయిత్రం 4గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నా మన్నారు. ఎముకలు, కీళ్ల, కంటి జబ్బులులతో పాటు ఇతర సాధారణ వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరం మేరకు శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

డోన్ : స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలో సోమవారం రాత్రి మృతి చెందిన సుంకులమ్మ (90)అనే అనాథ వృద్ధురాలి మృతదేహానికి మంగళ వారం ఆత్మబంధువు సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుల విన్నపం మేరకు ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు పానీపూరి మురళీ, సాదీఖాజా రాజు, శేర్షా, తాహేర్, ఆటో సుధాకర్ తదితరులు అంత్యక్రియలు చేశారు.

ఘనంగా శ్రీసేవాలాల్ మారెమ్మ దేవర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: మండలంలోని రాళ్లకొత్తూరుతాండా గ్రామంలో మంగళవారం శ్రీసేవాలాల్ మారెమ్మ దేవర ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాటసాని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, గుండ్లశింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రామి రెడ్డి, మాజీ సర్పంచ్ మధు నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌నాయక్, మధు, గోవింద్ నాయక్ లక్ష్మనాయక్, దేవ నాయక్, వెంకటేష్‌నాయక్, బాలుడు నాయక్, తుకారామ్ నాయక్, కుమార్ నాయక్, శివుడు, సుబ్బారెడ్డి, మల్లిరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ మాజీ కమిషనర్ తారకనాథ్ డిస్మిస్

కర్నూలు(లీగల్) : అవినీతికి పాల్పడి ఏసీబీకి దొరికిపోయి, న్యాయస్థానంలో దోషిగా నిర్ధారణ కాబడిన బనగానపల్లె నగర పంచాయతీ మాజీ కమిషనర్ ఎ.తారకనాథ్‌ను ప్రభుత్వం సర్వీసు నుండి డిస్మిస్ చేస్తూ మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ ఆదేశాలు జారీ చేశారు. 2014 సంవత్సరంలో సెప్టెంబర్‌లో భవన నిర్మాణ పనుల అనుమతి కోసం ఒక వ్యక్తి వద్ద నుండి రూ.5 వేలు లంచం తీసుకుంటూ కర్నూలు రేంజ్ ఏసీబీ పోలీసులకు పట్టుబడ్డాడు. 2014 సెప్టెంబర్ 11వ తేదీన ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అవినీతికి పాల్పడినట్లు కర్నూలు ఏసీబీ కోర్టు నిర్ధారించి 2019 జూన్ 25వ తేదీన రెండేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. కర్నూలు ఏసీబీ కోర్టు తీర్పును సవాలు చేస్తూ తారకనాథ్ రాష్ట్ర హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. అవినీతి కేసులో పట్టుబడి న్యాయస్థానం చేత శిక్షకు గురైనందున ప్రభుత్వం ఆయనను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలను మాజీ కమిషనర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం దానిపై రిట్ అప్పీల్‌ను 2021 సంవత్సరంలో రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసింది. ఆ రిట్ అప్పీల్ రాష్ట్ర హైకోర్టును డిస్మిస్ చేయగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్ 1859/2023 రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేయాలని కోరింది. సుప్రీం కోర్టు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ప్రభుత్వ చర్యలను సమర్థించింది. ఈ మేరకు మాజీ కమిషనర్‌ను ప్రభుత్వ ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఏపీ మున్సిపల్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే ఉత్తర్వులు అమలు జరగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి

డోన్ టౌన్: నోబెల్ గ్రహీత ఆల్బర్ట్ ఐన్ స్టీన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో, తారకరామనగర్ ప్రభుత్వ పాఠశాల్లో సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ, హెచ్‌ఎం సుబ్బరామయ్య ఆధ్యక్షతన ఆల్బర్ట్ ఐన్ స్టీన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, ప్రభావతి, మధుసూదనరెడ్డి, అల్లీ పీరా, ఆదినారాయణ, మధురవాణి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు


జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో డెస్కులపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: ఇంటర్మీడియేట్ పరీక్షలను బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 29వ తేది వరకు జరగనున్న పరీక్షలకు సంబంధించి కేంద్రాల చీఫ్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో ఇంటర్ పరీక్షలకు మూడు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం మొత్తం 620 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రంలో 184 మంది విద్యార్థులకు కేటాయించగా చీఫ్ ఆఫీసర్‌గా కళాశాల ప్రిన్సిపాల్ బీముడునాయక్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా విశ్వనాథ్ వ్యవహరించనున్నారు. అలాగే ఎస్‌వీ జూనియర్ కళాశాలలో 244 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా చీఫ్ ఆఫీసర్‌గా రమేష్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా జకరయ్య నియామకమయ్యారు. అదేవిధంగా కేజీఆర్ జూనియర్ కళాశాలలో మొత్తం 192 మంది పరీక్షలకు హాజరుకానుండగా చీఫ్ ఆఫీసర్ గా రామకృష్ణ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా జ్యోతి వ్యవహరించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష హాల్‌లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, బ్లూటూత్ తదితర వస్తువులు అనుమతి లేదని చీఫ్ ఆఫీసర్స్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు తెరవరాదని సూచించారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూలు కేంద్రాల్లో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో 240 మంది, ఏపీ మోడల్ స్కూల్లో 260 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగు ప్రైవేటు కళాశాలలతో పాటు కస్తూర్బా విద్యాలయం, మోడల్ స్కూలు విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ మేరకు విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు.

నవధాన్యాలు సాగు చేయాలి


రైతులతో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి

బనగానపల్లెరూరల్: రైతులు నవధాన్యాల పంటలను సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని యనకండ్లలో రైతు జానకిరాముడు భూమిలో 30 రకాల నవధాన్యాల విత్తనాలతో ప్రీమాన్స్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రారెడ్డి మాట్లాడుతూ ఆకు కూరాలు, కూరగాయాలు, చిరుధాన్యాలు, పప్పు దినుసుల సాగు చేపడితే భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం నవధాన్యలను ఎకర పొలంలో ఏ విధంగా విత్తుకోవాలి, పంటలను ఎలా రక్షించుకోవాలి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ సలాం, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన నిరసనలు

డోన్ టౌన్: జేఏసీ అమరావతి పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఆరవరోజు మంగళవారం కొనసాగాయి. ఎంప్లాయీస్ యూనియన్ డోన్ డిపో కార్యదర్శి ఐవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎయూ నాయకులు బండెయ్య, చంద్రుడు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రానికి ఉజ్వల భవిష్యత్తు


చొక్కాల తయారీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్ : స్థానిక రావ్ బహదూర్ శేషారెడ్డి మహిళా కుట్టు శిక్షణా కేంద్రానికి భవిష్యత్‌లో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. కుట్టు శిక్షణ కేంద్రానికి హైదరాబాద్‌కు చెందిన సంస్థ ఇచ్చిన మొట్ట మొదటి ఆర్డర్‌పై చేపట్టిన చొక్కాల తయారీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలోని మహిళలకు కుట్టులో తగిన శిక్షణ ఇచ్చి సొంతంగా గార్మెంట్స్ తయారీ సంస్థల ఏర్పాటు చేయించాలన్నదే మంత్రి బుగ్గన లక్ష్యం అన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని ఆర్డర్స్ డోన్ మహిళలకు లభించగలవనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేకల విమల, మాజీ కౌన్సిలర్ మేకల రాజు, మున్సిపల్ ఏఈ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జునరెడ్డి


బనగానపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జునరెడ్డి

బనగానపల్లెరూరల్: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జునరెడ్డి సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో మండలంలోని కైప ఎంపీపీ పాఠశాల, బనగానపల్లె పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ ఉర్దూ పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ విద్యార్థులతో మాట్లాడారు. భోజనానికి ముందు తర్వాత చేతుల శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అలాగే టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ సోహెల్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎస్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని ఆధ్వర్యంలో మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, రాజశేఖర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అవుకు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ అజాంఖాన్, ఎంఈఓ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వినోద్ కుమార్, యమున విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండల పరిధిలో ప్రభుత్వ ,ప్రైవేటు, అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 8236 మంది పిల్లలు ఉన్నారని, 7861 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసి దాదాపు 95శాతం పూర్తి చేశామని ఎంపీడీఓ తెలిపారు. ఈనెల 18న మాపాప్ రౌండ్ కింద మిగిలిన విద్యార్థులకు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ మల్లీశ్వరీ, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, వేణుగోపాలరాజు, దానమ్మ, తెరిసమ్మ, ఏఎస్‌ఎం వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని 5–19 ఏళ్ల లోపు ఉన్న 8,898 చిన్నారులకు మాత్రలు వేయాలని ఉన్నతాధికారులు టార్గెట్ విధించారని తెలిపారు. 94.34శాతం పూర్తి చేశామని, మిగిలిన వారికి ఈ నెల 18న వేస్తామన్నారు.

డోన్ : పట్టణంలోని 30వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నులిపురుగుల నివారణకు ఉపయోగించే ఆల్బెండజోల్ మాత్రలను కౌన్సిలర్ ఆర్ట్ రమణ పిల్లలకు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రత అవసరాన్ని ఆయన విద్యార్థులకు వివించారు. కార్యక్రమంలో ఎఎస్‌ఎం రామేశ్వరి, ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని గోర్లగుట్ట పాఠశాలలో హెచ్‌ఎం శివ కుమారస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆల్బెండోజల్ మాత్రలు వేశారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతను హెచ్‌ఎం విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ హసన్ బేగ్, పాఠశాల ఉపాధ్యాయులు వరలక్ష్మి, షఫీ ఉల్లా, కార్తీక, రమేష్ బాబు, అహ్మద్ హుసేన్, హెప్సిబా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్యాపిలి, జలదుర్గం వైద్యాధికారి నితీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. హుసేనాపురంలో ఈ కార్యక్రమాన్ని ఉప విద్యాశాఖాధికారి క్రిష్టఫర్ పరిశీలించారు. వ్యక్తిగతంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని క్రిష్టఫర్ సూచించారు.


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న దృశ్యం


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న డాక్టర్ వినోద్ కుమార్


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న దృశ్యం

హమ్మయ్య.. దాహం తీరింది..!


ఈ ఏడాది వేసవికాలం ప్రారంభంలోనే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. ఎండతీవ్రతతో మధ్యాహ్న వేళల్లో మనుషులతోపాటు పశుపక్షాదులుసైతం దప్పికతో అలమటిస్తున్నాయి. కోవెలకుంట్ల పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో మంగళవారం ఓ వానరం దాహం తీర్చుకునేందుకు అవస్థలు పడింది. కూల్ డ్రింక్ షాపు వద్ద ఎలాగో ప్యాటర్ ప్యాకెట్ సంపాదించుకుని నీరు తాగి దాహం తీర్చుకుని అక్కడి నుంచి తాఫీగా జారుకుంది. – కోవెలకుంట్ల